# గుర్తింపు

ఆలస్యంగా బడికి వెళ్ళడం నాకు నచ్చనిపని. అందుకే ప్రార్థన తర్వాత వెళ్తే ఒక పూట సెలవు పెట్టుకొని మరీ పనిచేస్తాను. ఇది నాకు నేను విధించుకునే శిక్ష. దీనివల్ల కల్గే ఆత్మతృప్తి అనిర్వచనీయం, అనుభవైక వేద్యం.

అదేమిటోగాని, ఆలస్యమైనప్పుడే అవాంతరాలు ఎదురౌతుంటాయి. మొదటి బస్సు తప్పిపోయింది. రెండోది మరికాస్త ఆలస్యంగా వచ్చింది. మొదటిదాంతో వెళ్తే 15 నిముషాలు ముందు చేరుకోవచ్చు. రెండోది సకాలంలో వస్తే రమారమి 5 నిమిషాలు ముందు చేరుకునే అవకాశముంటుంది. ఆ అయిదు నిముషాలూ అది రావడంలోనే మింగేసింది. డ్రైవరు వేగం పెంచి ఆ లేటును సవరించుకోవచ్చు. కానీ, నేనెక్కిం తర్వాత గానీ అసలు విషయం తెలీలేదు. ఇంత వరకూ అయిన ఆలస్యానికి ఆ పుణ్యాత్ముని డ్రైవింగే కారణం. ఎడ్లబండికి ఎక్కువ, ట్రాక్టర్‌కి తక్కువ అన్నట్లుందా స్పీడు. అప్పటికే చాలామంది ప్రయాణీకులు రకరకాలుగా తమ అసంతృప్తి వెళ్ళగక్కుతున్నారు. అప్పుడే నేనొక నిర్ణయానికొచ్చేశాను. ఈ రోజు ఒకపూట సెలవు తప్పదని.

బస్సు దిగాను: కనుచూపు మేరలోనే బడి. అదృష్టవశాత్తూ గంట అప్పుడే మోగినట్లుంది. పిల్లలంతా హడావుడిగా పరుగెత్తుతున్నారు. మా పి.ఇ.టి. మహా ఘటికుడు. పిల్లల్ని 'భయం'లో ఉంచుకున్నాడు ఎలాగైతేనేం. పంతుళ్ళ సంగతెలా వున్నా, పిల్లలు మాత్రం 90% ఉంటారు ప్రార్థన సమావేశానికి. రిస్టు చూసుకున్నాను. అటెండర్ రెండు నిముషాలు ఆలస్యంగా కొట్టినట్టున్నాడు గంట నాకోసమే నన్నట్లు, వేగం పెంచాను నడకలో, తప్పక ప్రార్థనందుకోగలనన్న విశ్వాసమూ పెరిగింది. నా దృష్టి రోడ్డు పక్కనున్న ముసలమ్మపై పడింది. 50 గజాల దూరంలో ఉందామె. ముగ్గుబుట్టలాంటి తల, ముడతలుపడ్డ శరీరం, చేతిలో కఱ్ఱ, దారంతో కట్టుకున్న - సగం పగిలిన కళ్ళజోడు. ఇంచుమించు అదే స్థితిలో కాళ్ళజోడు. చివికిన ముతక చీర.... ఆమె స్థితిని, పరిస్థితినీ చెప్పకనే చెబుతున్నాయి. ఒక్కసారిగా శ్రీశ్రీ మహాప్రస్థానంలోని ముసలమ్మ కళ్ళముందు జీవం పోసుకున్నట్లనిపించింది.

ఆమె కాళ్ళ ముందర ప్లాస్టిక్ సంచి ఒగటుంది. అది కాస్త బరువుగా ఉన్నట్టుంది. దాన్ని తలపైకో, భుజంపైకో ఎత్తుకునేందుకుకు తటపటాయిస్తున్నట్టు అనిపిస్తోంది.

నేనావిడకు దగ్గరగా వచ్చాను. 'ఆ మూట ఆ తల్లికి ఎత్తాలి. వీలైతే ఆమెని బస్‌స్టాప్ దాకా పంపించగల్గితే మరీ మంచిది.' అనిపించింది. అంతలోనే నా విధి గుర్తుకొచ్చింది. పనియే పరమాత్మ అనుకునే నా సిద్ధాంతం నన్ను హెచ్చరించింది. వేగం తగ్గిన నడకలో జవం పెంచమని, ఇలాంటివి మామూలేనన్న శుష్క వేదాంతం బోధచేసింది. కాని, ఏదో మానవతావాదం నా ముందు కాళ్ళకు బంధం వేస్తూంది. 'తనకు మాలిన ధర్మం లేదన్న సామెతతో ఆ బంధాన్ని నెమ్మదిగా తెంపుకుంటూ ఆమెను దాటి ముందుకు నడిచాను.

'ఆరి దుర్మార్గుడా! పదిమందికీ మార్గదర్శనం చేసే ఉన్నతమైన స్థానంలో వుండి, ఇదా నువ్వు ఆలోచించే పద్ధతి? మూర్ఖుడా! ఇది కూడా నీ డ్యూటీలో భాగమే!; నంటూ మనసు హెచ్చరించింది. నాలుగడుగులు ముందుకెళ్ళిన వాణ్ణి ఐదడుగులు వెనక్కి వచ్చాను.

ఆమెకు సాయం చేయాలి. చేస్తూండగా పదిమందీ చూడాలీ కనీసం నలుగురైనా మనల్ని మెచ్చుకోవాలి... కానీ, అక్కడ అంత 'సీన్' లేకపోవడం ఒకింత అసంతృప్తే. సరేలే! సాయం చేద్దాం.

"అవ్వా! ఎక్కడికెళ్ళాలి? సంచీ ఎత్తనా....?" అంటూ ఆ సంచీ అందుకోబోయాను.

నేనెక్కడ ఆ సంచీ తీసుకుంటానో అన్నట్లు గబుక్కున ఆమె ఆ సంచీని చేతిలోకి తీసుకుంది. "నాకెవ్వల సాయం వద్దు... నేనంత చాతగానిదాన్ననుకోకు!" అంటూ తీవ్రంగా నా వైపు ఓ చూపు విసిరి, సంచిని భుజానికెత్తుకొని తూలుతూ తూలుతూ బస్టాండ్ వైపు కదిలింది.

"ఔరా!" అనుకోకుండా ఉండలేకపోయాను. శతవత్సరాలకు ఒకటీ అరా దశకం తక్కువ వుండవచ్చు. ఈ వయస్సులో ఇంత ఆత్మాభిమానం.... ఆత్మవిశ్వాసమూనా? గబుక్కున కర్తవ్యం గుర్తొచ్చి వెనక్కి తిరిగి బడివైపు రెండడుగులేశాను.

"వందే..... మాతరం..... " ప్రార్థన నా చెవులకు సోకుతూనే నన్నుచేతనుడ్ని చేసింది.

0-0-0

"ఈ పూట సెలవు పెడ్తున్నాను సర్" మా ప్రధానోపాధ్యాయునితో అన్నాను. సెలవు చీటీ యిస్తూ.

"ఏంటీ? లేట్‌గా వచ్చినందుకా?" నావైపు చిరునవ్వు విసిరి, తన పనిలో మళ్ళీ లీనమయ్యాడు.

ఆ చిరునవ్వులో ప్రశంసకంటే ఎగతాళే ఎక్కువగా కనిపిస్తోంది. మొదట్లో ఇలాంటి సెలవు పెడ్తున్నప్పుడు ఎంతగానో ప్రశంసించి, వారించే ప్రయత్నం చేసేవాడు. ఇంతవరకు సహచరులే నోటితో పొగుడ్తూ నొసటితో వెక్కరించే వాళ్ళు. ఇప్పుడు ఈయనా వాళ్ళతో చేరిపోయినట్లనిపించింది. మనసు చివుక్కుమంది.

గుర్తింపులేని చోట నిల్చోవడం కూడా ఇబ్బందిగా అనిపిస్తుంది. అక్కడ కూర్చోవడం సైతం అసౌకర్యంగా వుంది. 'ఛ! సెలవు పెట్టి మరీ డ్యూటీ చేయడం వెర్రితనంగాక మరేమిటి? అనిపించింది.

ఇందాక హెడ్మాష్టరు ముందుంచిన సెలవు చీటీ తీసుకొని, 1/2ను పూర్ణాంకంగా మార్చి అతనికిచ్చేసి, మరోమాట మాట్లాడకుండా గబగబా బయటికొచ్చేశాను ఆఫీసులో నుండి.

నన్ను చూసి వెనక నుండి ఆయనెంత నవ్వుకుంటున్నాడో నేనూహించగలను. అంతేకాదు. ఆ తర్వాత మా స్టాఫ్ అందరికీ ఇది ఇప్పటి అసెంబ్లీ ఫలితాల్లాగా చర్చనీయాంశమై, రోజుల తరబడి నవ్వుకోవడానికి నేపథ్యమవుతుందనీ తెలుసు. అయినా నాకక్కడ ఉండాలన్పించలేదు. అందుకే పాఠశాల ప్రాంగణం దాటుతున్నాను. పెద్ద పెద్ద అంగల్తో.

"సర్ ! క్లాసుకి రారా?" ఎనిమిదో తరగతి శ్రీవాత్సవ వగరుస్తూ వచ్చి నా దారికడ్డు నిలుచున్నాడు.

బోధన నా ప్రాణం; విద్యార్థులు నాకు పంచ ప్రాణాలు. వాణ్ణి చూడగానే అడుగు ముందుకు పడలేదు. గొంతు పెగల్లేదు. క్షణమాలోచించి చెప్పాను.

"లేదమ్మా! కాస్త అర్జంటు పనుంది.... "సూటిగా వాణ్ణి చూడలేక, మొహం పక్కకు తిప్పుకొని గబగబా ఆవరణ దాటాను.

0-0-0

ఉదయం పదీ, పదకొండు గంటల మధ్య సిటీ బస్సుల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో మొదటిసారి చూస్తున్నాను. నిలబడటానికే ఇబ్బందిగా వుంది. ఒక్క కాలుమీద బరువేసి, భగవంతుడి మీద భారం వేసి, పైన సపోర్టింగ్ రాడ్‌ని పట్టుకొని, చిన్నపాటి సర్కస్ ఫీట్ చేస్తున్నాను. సరిగ్గా బస్సు మధ్యలో.

ఆడవాళ్ళ పరిస్థితీ సమానత్వ హక్కును ప్రతిబింబిస్తోంది. చక్కగా ఈ విషయంలో హఠాత్తుగా ఓ చిన్న గొడవ...

"లేవండి!"

"లేవయ్యా....."

"లే.... సార్....!"

"ఏయ్ ! లేవు వయ్యా.....!"

"అరె ! ఉఠో.... యార్...... !"

లేడీస్ సీట్‌లో కూర్చున్న ఓ పురుషపుంగవుణ్ని లేపే ప్రయత్నమది. నాకు చేరువలోనే ఆసక్తిగా గమనించసాగాను.

అతను సామాన్యుడిలా లేడు. చదువుకున్న ప్రబుద్ధుడిలా ఉన్నాడు. వయసుడిగిన వాడూ, బలహీనుడూ కాదు, వేషం కూడా భేషుగ్గానే ఉంది. అందుకే వాళ్ళ ప్రయత్నాలు 'దున్నపోతుమీద వాన'ను తలపిస్తున్నాయి.

ఎవరెన్ని రకాలుగా చెప్పినా అతనిలో మార్పురాలేదు. అతని పక్కనున్న స్త్రీ -బహుశా వాళ్ళావిడే కావచ్చు. ఆమె కూడా ఉత్సవవిగ్రహంలా కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది, ఏ మాత్రం చలనం లేకుండా. తోటి ప్రయాణీకులంతా అతణ్ని రకరకాలుగా 'కీర్తించడం' మొదలు పెట్టారు.

అంతసేపూ ఎక్కడున్నాడో ఛటుక్కున ఓ ముసలాయన అక్కడికొచ్చాడు. అందరినీ తోసుకుంటూ వేసుకున్న ఖద్దరువస్త్రాలు సగం మాసినట్లు కనిపిస్తున్నా, మూర్తీభవించిన తెలుగుదనంలా వున్నాడు.

"ఒరేయ్! లేవరా!" అన్నాడు నాతి కఠినంగా, అందరి దృష్టి అటు తిరిగింది.

ఆ జంటిల్మన్ విసురుగా తలతిప్పి, పురుగును చూసినట్లు చూశాడు. పెద్దాయన్ని,

"ఆరోగ్యం బాలేదా...?"

"...... "

"వికలాంగుడివా....?"

" ........ "

"లే!" ఠక్కున అతని చొక్కా కాలరు పట్టుకున్నాడు.


ఊహించని ఈ పరిణామానికి ఆ శాల్తీ కంగారుపడ్డాడు. అంతలోనే మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు.

"ఏయ్ ! ఓల్డ్‌మన్! మైండియువర్ బిజినెస్! ... చొక్కా వదులు..... !" ఓ చేత్తో అతని చేయి పట్టుకొని, తర్జని చూయించాడు.

పెద్దాయన అతని చొక్కా వదిలేశాడు. అంతలోనే ఎవరూ ఊహించని సంఘన జరిగింది.

"ఛెళ్!" జెంటిల్మన్ చెంప పేలిపోయింది.

ఆ దెబ్బతోనో, కోపంతోనోగాని, అతని మొహం నిప్పుకణికలా మారింది. అసలే తెల్లగా బొద్దుగా ఉన్నాడు మరి.



"ఒరేయ్! ముసలోడా! నిన్ను...." అంటూ దెబ్బతిన్న మృగంలా ఆయన మీదకి పోబోయాడు.

ప్రమాదాన్ని గమనించిన చుట్టూగల యువకులు అతడ్ని పట్టుకున్నారు.

"వదలండి! వెధవని. ఏం చేస్తాడో చూద్దాం! ఇంకో దెబ్బగానీ వేశానంటే అంబులెన్సు రావాల్సి వస్తుంది. నువ్వెంతరా? తెలంగాణా ఉద్యమంలో పోలీసుల లాఠీదెబ్బలతో రాటుదేలిన శరీరమిదిరారా! మానర్స్‌లెస్ బ్రూట్!"

పెద్దాయన మాటలకు కొందరు నవ్వారు; మరికొందరు చప్పట్లతో తమ ఆనందం వ్యక్తం చేశారు. ఇంకొకడు రెచ్చిపోయి విజిలేశాడు... బస్సు ఆగిపోయింది.

అదే అదనుగా సదరు జెంటిల్మన్ గబగబా దారిచేసుకొని బస్సు దిగేశాడు.

మరుసటి స్టేజిలో పెద్దాయనా దిగారు. నేనూ దిగాను ఆయన్ని పరిచయం చేసుకునేందుకు. డెబ్బయ్యేళ్ళ వయస్సులో ఆయన ఇరవైయేళ్ళ యువకుడిలా చలాకీగా నడవడమే కాదు. ఆ దర్జా చూస్తుంటే మూర్తీభవించిన ఆత్మవిశ్వాసంలా ఉన్నారు.

గబగబా అతని పక్కకు చేరాను. "నమస్కారం సర్ నాపేరు శ్రీను. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడ్ని.... బస్సులో మీ ప్రవర్తన చూశాక మిమ్మల్ని పరిచయం చేసుకోవాలనిపించింది. ఆయనతో పాటే నడుస్తూ మనోగతం చెప్పాను.

నావైపు చురుగ్గా చూశారు, ఓ చిర్నవ్వు నవ్వారు. "ఏముందయ్యా!.... నాపేరు సత్యనారాయణ. ఏదో.... ఆనాడు ఉద్యమంలో పాల్గొన్నాను. ప్రస్తుతం ఓ ప్రైవేటు స్కూల్లో గుమస్తాగా పనిచేస్తున్నాను."

నాకు ఆశ్చర్యంతో పాటు అపనమ్మకం కల్గింది. "అదేంటి సర్. మీకు ప్రభుత్వ సాయ....."

"ఏ సాయం కోసమూ నేను ఉద్యమంలో పాల్గొనలేదు" చెరగని చిరునవ్వుతో చెప్పుకుపోతున్నారాయన. "ఆనాడు దేశానికి మా సేవలు అవసరమనుకొని, ప్రాణాలకు తెగించి పోరాడాము. నాకు స్వశక్తి మీద నమ్మకమున్నది. ఏ గుర్తింపుకోరీ ఆ పని చేయలేదు. ప్రభుత్వమిచ్చిన తామ్రపత్రం కాదనలేకపోయాను. ఆర్థిక సహకారం, పదెకరాల భూమి.... నాకు అవసరమనిపించలేదు. క్లర్కుగా ఉద్యోగంలో చేరాను.

"మరి.... పిల్లలు....! "

"ఆ! ఉన్నారు. వాళ్ళను నిర్లక్ష్యం చేయలేదు. ఇద్దరు కొడుకుల్ని పెద్ద చదువులే చదివించాను. ఇంటా-బయటా స్థిరపడ్డారు ఇద్దరూ.

"మరి వాళ్ళు మిమ్మల్ని....." ఎలా పూర్తి చేయాలో తోచక ఆర్ధోక్తిలో ఆగిపోయాను.

నా భుజం తట్టారు ఆప్యాయంగా. "చూడు బాబూ! నీ సందేహం నాకర్థమయ్యింది. ఇవ్వటమేగాని, పుచ్చుకోవడం తెలియదీ సత్యానికి. ప్రతిఫలాన్ని ఆశించి చేసే సాయం. గుర్తింపునాశించి చేసే త్యాగం అర్థంలేనివి... నా పిల్లలకు నేనింత ఖర్చు పెట్టాను. వాళ్ళ నుండి నాకింత రావాలి అనే జమా ఖర్చుల ధోరణి నాకు నచ్చదు. వాళ్ళకు మంచి భవిష్యత్తునీయడం నా బాధ్యత. వాళ్ళ విద్యుక్తధర్మాన్ని వాళ్ళే గుర్తించాలి. అయినా నా బిడ్డలు దుర్మార్గులు కాదు. నాపట్ల వాళ్ళ కభిమానమే. నేనే వాళ్ళ సాయం తీసుకోను. బహుశా ఆ అవసరం కల్గకపోవచ్చు. నేను చేసే పని మంచిదని నమ్మి పనిచేస్తాను. నా శక్తితో నేను బతకడంలోని ఆనందం పరాధీనతలో లేదని గ్రహించిన వాడ్ని నేను. ఈ జీవితం హాయిగా వుంది. నా కోసం నేను బతుకుతూ నాకు చేతనైన సాయం చేయడమే నాకు తెలుసు. ఇదే మానవజీవితం. ప్రశాంతంగా గడపటానికి మార్గమని నమ్మినవాడ్ని. నేను చేసే పనికి నా మనస్సాక్షి గుర్తింపు. వేరెవ్వరి గుర్తింపులూ.... ప్రశంసలూ అఖ్ఖర్లేదు...."

ఆయనలోని మహనీయుడ్ని చూస్తుంటే నా మనస్సుకు కమ్ముకున్న పొరలన్నీ తొలగిపోతున్న అనుభూతి కల్గసాగింది. ❖

(12-8-2004 ఆంధ్రభూమి వారపత్రిక)